66

ఈ గదిలోకి రాకముందు దాకా నాకా సమస్య ఎదురవ్వలేదు. నా యిష్టానికీ, స్వేచ్ఛకీ ఆటంకం కలగ లేదు. ఉదయమే గదికి తాళం పెట్టు కుని ఏ పది గంటలకో పత్రికాఫీ సుకు వెళ్ళినవాడిని తిరిగి రాత్రి పది గంటలకుగాని గదికి చేరుకోను. చేరుకున్న వెంటనే ఇన్ని తెల్లకాగి తాలు ముందరేసుకుని బరబరా ఎంత రాత్రయేదీ కానకుండా రాసు కునేవాణ్ణి. లేదా సమీక్షలు రాయా ల్సిన నవలలు చదువుకునేవాణ్ణి. అచ్చొత్తించాల్సిన కథలను ఎడిట్ చేసుకునేవాడ్ని. మరింక కవర్ చెయాల్సిన మేటర్ వెదుక్కునే వాణ్ని. ఇంకా తీరిగ్గా ఉంటే వెల్ల కిలా మంచం మీద వాలి పత్రికాఫీ సులో నా బతుకును గురించి ఆలో చించేవాణ్ని, విచారించేవాణ్ని, నిద్ర పోయేవాణ్ని. రాత్రిపూట ఉండే నిశ్శబ్దాన్ని అందుకే నేనంతగా ప్రేమిస్తాను, అంతగా కోరుకుం టాను.

వృత్తిరీత్యా, ప్రవృత్తిరీత్యా ఇటు వంటి వాతావరణం కోరుకునే నేను ఈ గదికి మారాల్సొచ్చింది. పని వత్తిడి ఎక్కువవుతున్న కొద్దీ నేనుండే గదినుండి పత్రికాఫీసుకు వెళ్ళడానికి పట్టే రెండు గంటలూ, తిరిగి గది చేరుకోవడానికి మర్రెండు గంటలూ- మొత్తం నాలుగ్గంటల కాలాన్ని ఆదా చేయగలిగితే నాకు కొంత విశ్రాంతిగా ఉండొచ్చునన్న ఊహ రావడంతోనే ఈ గదికి మారాల్సొచ్చింది.

మారి కోరికోరి ఈ సమస్యను తెచ్చుకోవాల్సి వచ్చింది.


నిశ్శబ్దం అంత భయానకమైనదనీ, భయానికి కారణం తెలిసినప్పటికీ భయాన్ని నివారించ లేకపోవడం మానసిక దౌర్బల్యం వల్లనేననీ అక్కడికొచ్చాకనే తెలిసింది. నాకున్న మానసిక దౌర్బల్యం తొల గించుకోవడం మాత్రం తెలియ లేదు.

ఇంతకీ నేనీ గదికి వచ్చినరోజునే ఆ నిజం తెలిసికోవడానికి కారణం- పది గంటలకు గదిచేరి ఏదో పర పరామని! రాసేసు కుంటున్నాను. ఎంతసేపై అలా రాస్తున్నానో నాకే తెలియదు.

ఫ్ర్ర్ర్ర్ర్....టక్ టక్ టక్....

దూరంగా మొదట విజిలు శబ్దమూ, దానికి వంతగా వెంటనే బాణా కర్రతో ఏ ఇంటి అరుగు మీదనో బాదిన శబ్దం.

వినగానే ఒళ్ళు జలదరించింది. చేతిలో కలంతో సహా కుర్చీకి




అంటుకుని ఉండిపోయేను. మరి కొద్దిసేపట్లో నా గది ముందరే ఫ్ర్ర్ర్ర్ర్....టక్ టక్ టక్.... దగ్గిరగా విన్పించేసరికి నా ప్రయత్నమేమీ లేకుండానే భయంతో నా కళ్ళు పెద్దవై నట్టూ, ముఖం నిండా చెమట పట్టేసినట్టూ అనిపించింది. ఇంకో అయిదు నిమిషాల్లో మళ్ళీ అవే శబ్దాలు దూరంగా నేపథ్యంలోకి వెళ్ళిపోతూంటే వంట్లోని జ్వరంలాంటి టెన్షన్ క్రమేపీ దిగజారి మామూలు మనిషి నయ్యేను.

మనసులో ఆ భయంవల్ల కలిగిన ఆందోళనలతో రాయవలసింది మరి రాయలేకపోయేను. పోనీ మరో పని చేద్దామని సమీక్షార్థం వచ్చిన నవలను పట్టుకోబోతే చదవలేకపోయాను. లాభంలేదని మంచం మీద వాలిపోయి బలవంతంగా

ఒక రైలుని దొంగలు దోచేస్తున్నారు. ప్రయాణీకులందరూ తప్పని సరిగా తమ డబ్బుల్ని, సొమ్ముల్ని తీసి వాళ్ళచేతుల్లో వుంచేస్తున్నారు. ఒక ట్రావెలింగ్ సేల్స్‌మన్ వంతు వచ్చింది. అతడు తన వద్ద ఐదు వందల రూపాయల్లోంచి యాభై రెండున్నర వేరే జేబులో వుంచేసుకొంటూ మిగతా సొమ్ము అప్పగించేశాడు.

"అరె! ఆ డబ్బులేమిటి??" అని దబాయించేశాడొక దొంగ.

"అది కంపెనీ డిస్కౌంటు" అన్నాడా సేల్స్‌మన్.

—సురాశర్మ

మర్నాడు పత్రికాఫీసులో చెయ్యాల్సిన పని మీదకు మనసు లగ్నం చేద్దామంటే కుదరలేదు. నిద్రపోదామంటే నిద్ర కూడా రాలేదు.

అంతవరకూ నిరాఘాటంగానా పనులు జరగటానికి సహకరించిన నిశ్శబ్దం ఒక చిన్న గులకరాయి లాంటి ఫ్ర్‌ర్‌ర్‌ర్.... టక్ టక్ టక్ శబ్దాలతో కలత బారిపోయి, ఆ శబ్దాలు తిరిగి నిశ్శబ్దంలో ములిగిపోయినప్పటికీ ఆ నిశ్శబ్దం అనిశ్చల నిశ్శబ్దం కాలేకపోయింది.

ముందు రోజు తీసుకుపోయిన 'హోంవర్క్' చెయ్యకపోవటంవల్ల మర్నాడుదయాన్నే మా మేగజైన్ సెక్షన్ ఎడిటర్ సుబ్బారావుగారిచేత చీవాట్లు తిని కుర్చీలో కూర్చున్నాను. పేరుకు నాది ఎనిమిది గంటల పని. రోజుకి ఇరవై నాలుగ్గంటలు కూడా చాలవన్నంత పని చేస్తున్నాను. నిద్రరానీ, ఆకలేయనీ, జబ్బు చేయనీ పని చేస్తూనే ఉంటాను. రాస్తూనే వుంటాను. ఎనిమిది గంటల పనే చేయించండోయ్ అని ఎలుగెత్తి చాటే కార్మిక చట్టపు గొంతు చించినంతపని చేస్తున్నాను.

కాని ఏం జరిగింది?

ఫ్ర్‌ర్‌ర్‌ర్.... టక్ టక్ టక్.... శబ్దాలు గుండె చెవులకు విన్పించాయి.

ఖాకీ టోపీ, ఖాకీ దుస్తులు వేసుకున్న పొట్టి మనిషి గుండె కళ్ళకు కన్పించాడు. చీపి కళ్ళూ, బండ ముక్కూ, చదరముఖంతో సాక్షాత్కరించాడు. ఎర్రబూట్లూ, బానా

కర్రా, నోట్లో విజిలూ పెట్టుకుని కళ్ళ ఎదుట నిలిచాడు.

కళ్ళూ, చెవులూ ఉన్న గుండెకు మనసే ఉండదా? ఆ మనసుకి అన్పించింది- వాడికి డ్యూటీపట్ల ఎంత శ్రద్ధ? వాడు రాకపోతే ఎవ డైనా చూసేడా, ఏమైనానా? అయినా వేళ తప్పకుండా రోజూ నిద్రమాను కుని చేసే ఆ పనికి ప్రతిఫలం? కన్నాలు వేసేవాళ్ళూ, చీకటి పనులు చేసేవాళ్ళూ తిట్టుకునే తిట్లూ.... ఎప్పుడో పగలు వచ్చి చాయ్‌కి చెయి చాపితే ఇచ్చినవాళ్ళు ఇచ్చే పావలా, అర్ధానూ. నిద్రమానుకుని చేసే ఆ పనిని వదిలిపెట్టి కాయ కష్టం చేసుకుంటే అంతకన్నా ఎక్కువగానే లాభ ముంటుంది. అయినా మనుషులచేత మాటలు పడకుండా వాళ్ళకి, వాళ్ళ ఆస్తులకి కాపలా కాస్తూ ఏదో చేతనయినంత చేస్తున్నానన్న తృప్తితోనూ, నిజా యితీతోనూ వాడు బ్రతికేస్తున్నాడు.

మరి నేను?

చేతనయిన దానికంటే ఎక్కువచేస్తు న్నానన్న తృప్తితో ఆగితే, మను గడలేదన్న యధార్థానికీ, నిజాయి తీగా బ్రతికితే నెగ్గలేమన్న నిజా నికీ ప్రతీకగా ఈ కుర్చీలో మిగిలి పోయి ఉన్నాను.

వెంటనే ఛఛ-ఎంత నిరాశా వాదిగా ఆలోచిస్తున్నాను అని విసుక్కు న్నాను. ఇంకా పని చేయాలి. మరింత శాయశక్తులా నా పత్రికని పటిష్టం చెయ్యాలి. ఇంతకింతగా సుబ్బారావు గారిచేత మెప్పుపొందాలి- అనిదృఢంగా నిశ్చయించుకున్నాను.

---

హైదరాబాదు సిటీ బస్సులోంచి ఒకానొక ఓల్డు జోసఫ్, మలక్ పేటలో దిగేస్తూ, తన ప్రక్కన కూర్చొన్న సుబ్బారావు గొడుగుని చంకలో పెట్టుకు దిగేస్తుంటే-సుబ్బారావు గద్దించి, “అరె! నా గొడుగు తీసుకొంటారేమిటి?” అన్నాడు.

అందుకు జోసఫ్ నవ్వేస్తూ, “క్షమించాలి. నాకు ఎప్పుడూ చంకలో గొడుగు వుండటం అలవాటు” అన్నాడు.

జోసఫ్ మలక్‌పేటలో తన కూతుళ్ళవి, కోడళ్ళవి మొత్తం పద కొండు గొడుగుల్ని రిపేరు కిచ్చివుండి, అక్కడికెళ్ళి సొమ్ము చెల్లించి గొడుగులన్నీ కట్టగా చంకన బెట్టుకుని మళ్ళీ సిటీ బస్సెక్కాడు. ఆ బస్సులోనే ఇదివరకు సుబ్బారావు కూడా వెడుతూ జోసఫ్‌ని ఆశ్చర్యంగా చూసి-

“ఎక్కడో పెద్ద ఛాన్సే కొట్టారే!” అన్నాడు. —సురాశర్మ.

క్ర్ర్ర్ర్....టక్ టక్ టక్.... చెప్పుల లోపలి పొరల్లో గింగురు మన్నాయి.

భయం కాదు- కోపం వచ్చింది. మండిపోయింది. అప్పను, ఆ శబ్దాలవల్లనే పని జరగలేదు. ఆ విజిలూ, బాణాకర్రల శబ్దాలవల్లనే సుబ్బారావుగారిచేతచీవాట్లు తిన్నాను. అంచేతనే ఇంత నిస్పృహగా ఆలోచించాను.

రాస్కెల్! వాడా పని మానుకో వాలి. లేకపోతే బుర్ర బాదేస్తాను. పీడా విరగడైపోతుంది. కేసు?! లాభంలేదు.

ఓ పది రూపాయలిచ్చి కనీసం మా వీధిలోనైనా విజిలు వెయ్యడం, బాణాకర్రతో బాదడం మానెయ్య మంటాను. వెధవలు రుచిమరిగితే, మూడు మూడురోజులకీ చెయ్యి చాపుతారు. ఇదీ లాభంలేదు.

ఈ ఉద్యోగం మాన్పించి ఇంకో చోట ఏ వాచ్ మెన్‌గానో వేయిం చేస్తాను. ఎక్కడ? మా పత్రికాఫీ సులోనే. సుబ్బారావుగారితోనూ, వారిద్వారా బాస్‌తోనూ చెప్పించి ఉద్యోగమిప్పించేస్తాను. వీడెవడు అని అడిగితే....? చుట్టమా, బంధువా? ఇలా రోజూ నా పనికి ఆటంకం కలిగిస్తున్నాడూ- అని చెప్పనా?

---

ఒకానొక జీర్ణ దేవాలయాన్ని పునరుద్ధరించి నిర్మాణాలు చేస్తున్నారు. వూళ్ళోని ధర్మకర్తలు తమకు తోచిన సహాయాల్ని నిర్మాతల కందిస్తున్నారు. ఒకానొక సుబ్బయ్యగారి పెరట్లో ఎందుకూ పనికి రాకుండా ఒక రాతి దూలం పడివుండింది. సుబ్బయ్యగారు దాన్ని దేవాల యానికి బహూకరించి, దాని మీద అందుకు గుర్తుగా తన పేరును మలి పించుకోవాలనుకొని-అక్కడుండే ఒక శిల్పి నడిగితే, యాభయి రూపాయ లడిగాడు. సుబ్బయ్యగారు గుటకలు మింగుతూంటే ఒకి అరవతను "నేను చెక్కుతాను. కానీ నాకు తెలుగు రాదు. మీరు అక్షరాల్ని కాగితం మీద రాసిస్తే నేను చెక్కిస్తాను. ఐదు రూపాయలివ్వండి చాలు" అన్నాడు. సుబ్బయ్యగారు సంతోషంతో కాగితం మీద ఫలానా సుబ్బయ్యగారి ధర్మం, తేదీ 11—12—1979 అని రాసి యిచ్చాడు. మరునాడు ఉదయమే అరవతను వచ్చి "అక్షరాలు చెక్కాను. నా డబ్బు లిచ్చెయ్యండి" 'అన్నాడు. సుబ్బయ్యగారు డబ్బులిచ్చేసి తన మిత్రు లతో సపరివారంగా సగర్వంగా వెళ్ళి అందు మీది అక్షరాల్ని చూసి నివ్వెరపోయాడు. "ఫలానా సుబ్బయ్య కాలధర్మం, తేదీ 11-12-1979" అని చెక్కబడి వుందక్కడ.

—సురాశర్మ.

వాడి సమస్యకు పరిష్కారం వెదికే లోపలే టేబులుమీద నేను చూడ వలసిన కాగితాల దొంతర పెరిగి పోతూంటే ఆలోచనలు కట్టి పెట్టాల్సి వచ్చింది.

ఆ తర్వాత రెండు రోజులు వరసగా సుబ్బారావుగారిచేత చీవాట్లుతినకూడ దన్న పట్టుదలతో ఎంత రాత్రయేదీ చూడకుండా పని చేసుకుపోతూం డడం....మధ్యలో విజిలూ, బాజా కర్రల శబ్దాలు వినగానే ఒక్క-క్షణం కుదురు తప్పిపోవడం.... ఆ వెనువెంటనే రెట్టింపు శ్రద్ధతో పని చేసుకుపోవడం జరిగింది.

రెండురోజులా విధంగా జరగ్గానే మరి గూర్ఖావాడి శబ్దాలవల్ల నా పని కంతరాయం కల్గుతుందన్న అను మానంపోయింది. ముందే తయా రుగా ఉంచుకున్న పట్టుదల తన శరీ రాన్ని మరింతగా పెంచేసి నాకు గొడుగు పట్టడంతో పని నిరాఘా టంగాసాగిపోతోంది.ఆఒక్క-క్షణం ఫ్ర్ర్ ర్ర్ ర్ర్....అన్న విజిలు శబ్దం వినగానే ఎర్రజెండా చూపిన రైలు బండిలాగా కలం ఆగిపోతుంది. టకటకటకమన్న చప్పుడికి కర్ర దెబ్బ తిన్న మైసూరెద్దులాగా చక చకా కలం సాగిపోయేది.

పదిరోజులు వరసగా రాత్రీ పగలూ పన్జేసేసరికి ఆ వేళ మధ్యాహ్నం సరికి జ్వరమావినిలో పాదరసం పరిగెత్తడం కనిపించినట్లుగా నాలో జ్వరం క్రమేపీ పెరగడం స్పష్టంగా తెలుస్తోంది. అంతకుముందు రెండు రోజుల నుండీ కాస్త నలతగా ఉన్న ప్పటికీ లక్ష్యపెట్టలేదు. ఇప్పుడు తప్పనిసరై వెళ్ళి సెలవు అడిగేను. రాబోయే రెండు సంచికలకు మేటర్ సిద్ధంగా ఉండడంతో తృప్తిపడ్డారు సుబ్బారావుగారు. అందుకే, "అరె! జ్వరమా....జ్వరంతో ఎందుకొచ్చే సేవోయ్? వెళ్ళ్వెళ్ళ్వెళ్ళు........" అంటూ అర్జంటుగా జాలిపడి వెంటనే పంపించేసేరు.

తిన్నగా డాక్టరు దగ్గరకు వెళ్ళి, అట్నించటే బజారుకెళ్ళి పళ్ళూ బ్రెడ్డూ కొనుక్కొని గదికి రావడ మేమిటి-మంచంమీద వాలేను. నీర సంతో నిద్రపోయేను. ఆ నిద్ర పోవడం రాత్రి ఏ వేళప్పుడో మెల కువ వచ్చింది. కడుపులో ఏమీలేక పోవడం మూలాన ఆకలిగానూ, నీరసంగానూ ఉంది.

సహించకపోయినా ఏదో తిన్నానని పించేను. దాంతో జ్వరం కాస్త నిమ్మళించినట్టు అనిపించింది,

తిరిగి మంచం మీద పడుకున్నాను. నిద్ర రావడంలేదు. రాసుకుందా మంటే ఓపికలేదు. అయినా తిరిగే కాలూ, వాగే నోరూ ఊరుకోనట్టు

గానే రాసే చెయ్యి కూడా ఊరుకో లేదు. అయితే ఏం రాసుకోను? హోం వర్కు ఏదీ తెచ్చుకోలేదు. ఇంకో పత్రిక పెట్టినకథల పోటీకి కథ రాస్తేనో...?రాయడమేజరగాలి గాని పంపుకోవడానికి సుబ్బారావు గారు పర్మిషనే ఇవ్వకపోతారా? వెంటనే మంచం మీదనే మఠం వేసుక్కూర్చుని కాగితాలు ముందర రేసుకున్నాను. అంతకు ముందు కథల్రాయడం అంతగా అలవాటు లేకపోయి నప్పటికీ సబెడిటర్‌గా ఉన్న అనుభవంవల్ల చకచకా రాసుకుపోతున్నాను.

భావాలు ఒకదానితో మరొకటి ఉప నదుల్లా అందంగా కలుస్తున్నాయి. కొండలాంటి వస్తువు చుట్టూ శైలి స్రవంతిలా పారుతోంది. సారవంతమైన శిల్పాన్ని మేటలేస్తూ సామాజిక ప్రయోజనంలాంటి లక్ష్యం వైపు సాగిపోతోంది.

ఇంతలో....

ఫ్రీర్ర్ర్ర్ర్ అంటూ నా గదిముందే చెవులు హోరెత్తించేలా విజిలు వేసేడు గూర్ఖా. జ్వరంతో పచ్చిగా వున్న చెవులు లబలబలాడేయి. ఆ వెంటనే బాణా కర్రతో టక్‌టక్ మని నా గది గుమ్మం మీదనే బాదేడు. నీరసంగా ఉన్న నా నెత్తి మీదనే ఆ దెబ్బ పడినట్టు కళ్ళు పచ్చబడ్డాయి.

ప్రవాహంలో నీరింకి పోయినట్టు, నా కలంలో సిరా నిండుకున్నట్టు, నా బుర్రలో భావాలు బెదిరిపోయి నట్టు- చెదిరిపోయేయి. వాడి బూట్ల చప్పుడు దూరంగా వెళ్ళిపోతున్న ప్పటికీ ఎగిరిపోయిన భావాలు తిరిగి కలం గూటికి చేరుకోవడంలేదు.

గూర్ఖా మీద విపరీతమైన కోపం వచ్చింది. అసలే జ్వరం....తిండి లేదు....నీరసం..పట్టలేనంత కోపం వచ్చింది.

రాస్కెల్! గది గుమ్మం మీదను బాదేసి అలా వెళ్ళిపోతే దొంగల భయం లేకుండా పోతుందా? వీడి మొద్దు ముఖం చూసే దొంగలు రావడం మానేస్తున్నారా? మరో వేళలో వచ్చి కన్నం వెయ్యలేదే విటి? ఎవడు పెట్టేడండీ వీణ్ణి? చీపి కళ్ళూ, బండముక్కూ, గంటు మొఖం వీడూనూ. మరోపనిచెయ్య డానికి ఒళ్ళు వంగదు. పగలంతా సుఖంగా నిద్దరోయి రాత్రి షికార్లుకి అలవాటుపడ్డవాడు మరో పని ఎలా చెయ్యగలడూ? ఇలాంటి సోమరి పోతుని కాల్చి పారేయాలండి. అవును. ఏ దొంగవెధవో రాత్రి పూట వెనకమారుగా బుర్ర బద్దలు

కొట్టేయాలి. అప్పనప్పను తప్పదు బద్దలు కొట్టేస్తాడు. లేదా బూటు కాళ్ళతో ఏ పావునో పుట్టనో మట్టేసే కసితీరా అద్దైనా కసిక్కాన కాటెయ్యాలి. ఎందుకు వెయ్యదూ! వేస్తుంది- చూస్తూ వుండండి. తప్పదు- బుర్ర బద్దలై పోతుంది. తప్పత్తప్పదు- ఏ పామో కాటే స్తుంది. తప్పత్తప్పత్తప్పదు. నీరస కోపంలో శాపనార్ధాలు పెట్ట డం తప్పించి మరింకేం చెయ్యలేక పోయేను. తిట్టి తిట్టి తిట్టి ఏ రూముణో పడుకుని నిద్రపోయేను. జ్వర తీవ్రతలో పగలెప్పుడో కళ్ళు తెరిస్తే....కష్టపడి రిక్షాలో డాక్టరు దగ్గరకి వెళ్ళడం....తిరిగి వచ్చి రెస్టు....ఏవేళప్పుడో ఏదుంటే అది తినడం....జ్వరం....ఎప్పుడో సోలి పోయి నిద్రపోవడం. మూడురోజు లకుగాని జ్వరం తగ్గలేదు.

నాలుగో రోజు సాయంత్రానికి ఒంట్లో కులాసాగా ఉన్నట్టనిపిస్తే అలా పత్రికాఫీసుకు వెళ్ళేను. సుబ్బారావుగారితో చెప్పేను. పీక్కు పోయిన నా అవతారం చూస్తే చెప్పాపెట్టకుండా మూడు రోజులు సెలవు తీసుకున్నందుకు ఏవీ అన లేకపోయేరు.

"ఏరి ఈవేళప్పుడేం ఇలా వచ్చేరు?" ఏవీ అనలేకపోయినం దుకు విసుగ్గా అడిగేరు.

"ఏరేంలేదు....పుస్తకాలు పట్టుకు పోయి రాయాల్సిన సమీక్షలైనా రాసెయ్యొచ్చును. పైగా నీరసంగా వుంది. మరో రెండు రోజులు సెలవు అడగవచ్చునుగదా అని.."

మొదటిదానికి ముఖం వికసించినా, రెండోదానికి ముడుచుకుపోయింది. అయినప్పటికీ రెండో దానివల్ల మొదటిపని అవుతుంది కాబట్టి సరే నన్నారు. నాకు నేనే అమ్మనీ, నాన్ననీ. అందుకని వచ్చేటప్పుడు నాక్కావలసిన సరంజామా- మందులూ, పళ్ళూ అవీ తెచ్చు కున్నాను.

రాత్రి తొమ్మిదింటికే ఊరంతా సద్దు మణిగింది. ఓ నవల తీసేను. చదవ డానికి నీరసంగా వుంది.

ఏం నవలో ఏంపాడో! లక్షణాలైనా తెలియకుండా రాసి పడేస్తున్నారు పుంఖాను పుంఖాలుగా. ఏఁవీ అంటే డిమాండు. కథలకీ, కవితలకీ డబ్బుల్రావు. పేర్రాదు, పాఠకుల కక్కర్లేదు. పబ్లిషరడగడు. సినిమా వాడు తియ్యడు. మరందుకే ఎలాం టివాళ్ళూ నవలల్రాయడమే.

కలం తీసేను. కాగితం తీసేను. దున్ని పారేయడమే ఇంక.

కలం నడవదేం? బుర్రలో ఆలోచ నలేమో రైలుబండిలా పరిగెడు

తూంటే కలం కనీసం నడవనైనా నడవదేం? కలం ఎందుకిలా మొరాయిస్తున్నది? ఏవిటమ్మా ఏవిటి కావాలి?

అద్దీ సంగతి! హుషార్ చెయ్యాలి. పారా హుషార్ చెయ్యాలి నీన్ని. ఎలా? అలవాటైన విజిలుతో. లేక పోతే రాయనంటోంది.

విజిలూ, బూటాకర్రల శబ్దాలు మొదటి రోజు భయాన్ని కలిగించి రాతకి భంగం కలిగించేయి. తర్వాత్తర్వాత విసుగూ, కోపం కూడా వచ్చేయి. ఒక దశలో జాలి కూడా పడ్డాను. అతి నిశ్శబ్దంలో శబ్దాల్ని మనసు సునిశితంగా గ్రహిస్తుంది. నాకూ, నా కలానికీ అర్ధరాత్రివేళ ఆ శబ్దాల్ని ఒకసారి వింటేగాని పని చెయ్యలేనంతగా ఇప్పుడు అలవాటయ్యింది.

సరే....వాడొచ్చే టైమవుతోంది. వచ్చేస్తూండి ఉంటాడు. వచ్చేస్తూంటాడు. వచ్చేస్తాడు....వచ్చేస్తాడు.. వచ్చేస్తా....వచ్చే... అనుకుంటూ నే తెల్లవారు ఝాము మూడు గంట లయ్యింది. నీరసంతో పడకేసేను.

ఉదయాన వేగమే లేచేను.

పత్రికాఫీసులో చేరిన ఇన్నాళ్ళకి.... జ్వరపు రోజులు తప్పించి....ఏవీ రాయకుండా, ఏవీ రాయ లేకుండా, పోయింది నిన్నటి రోజునే. దాని క్కారణం? విచిత్రమైన సంగతే అవ్వొచ్చుగాక....గూర్ఖా రాకపోవ డమే అన్నదిమాత్రం నిజం!

మా వీధి చివరన ఉన్న కిళ్ళీ కొట్టు వాడు రాత్రి ఏ వేళప్పుడో కొట్టు మూసి, కొట్టు ముందరే బల్ల మీద పడుకొంటూ వుంటాడు. ఒక్కోసారి గూర్ఖాకి బీడీముక్కో, అగ్గిపెట్టో ఇస్తూ కొంతసేపు పిచ్చాపాటీ మాట్లాడుతూ ఉంటాడు. వాణ్ణి అడిగితే విషయం తెలుస్తుంది.

"ఓ బర్కిలీ ఇయ్యవోయ్...." అని డబ్బులిస్తూ...."అన్నట్టూ....రాత్రి గూర్ఖా వచ్చేడా?" అనడిగేను.

"ఎవ్వడు?... గూరకావోడా?...ఆడు సచ్చిపోయి మూడ్రోజులైందండి" అన్నాడు వాడు. ఒక్కసారిగా మనసు మొద్దుబారిపోయింది. ఆ వెనకనే నే నా రోజు వాణ్ణి తిట్టుకున్న తిట్లు గుర్తొచ్చేయి.

"ఎలా చచ్చిపోయేడు?"

"క్షయ. క్షయ బాబూ. ఆ జబ్బుతో చానాళ్ళ నుండీ తీసుకుంటున్నాడండి. అయినా పనెగ్గొట్టడం ఆడి క్కిట్టదండి...." •